# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **న్యూఢిల్లీలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈరోజు ప్రారంభమవుతుంది.**
2. **రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **రాష్ట్రంలో 1271 కోట్ల రూపాయలతో 24 క్రిటికల్ బ్లాక్ లు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 44 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించనున్నట్లు కేంద్రమంత్రి జేపీ నడ్డా వెల్లడించారు.**
4. **అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు.**

==========================

న్యూఢిల్లీలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈరోజు ప్రారంభమవుతుంది. భారత్ మండపంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో భారత్ అధ్యక్షతన ఈ సదస్సు జరుగుతుంది. బ్రెజిల్, చైనా, రష్యా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇరాన్, ఇథియోపియా, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యూఏఈ సహా 11 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

-------------------------

రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ పాత ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఈరోజు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన 9 అత్యవసర చికిత్స కేంద్రాలను, 12 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలను వర్చువల్‌గా వారు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

వాయిస్..30.. సెకన్లు

రాష్ట్రంలో 1271 కోట్ల రూపాయలతో 24 క్రిటికల్ బ్లాక్ లు, 25 ఇంటిగ్రేటెడ్ లాబ్‌లు, 44 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఐకానిక్ భవనాల్లో భాగమైన జీఏడీ టవర్, హెచ్‌ఓడీ టవర్లు, అసెంబ్లీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ఐదు టవర్లకు సంబంధించి స్టీల్ డయాగ్రిడ్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అసెంబ్లీ భవన నిర్మాణంలో కీలకమైన స్పైర్ నిర్మాణ పనులను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

---------------------------

ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్త నిబంధనలు-2026ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యతా సూత్రాలకు నిబంధనల్లో ప్రాధాన్యత ఇచ్చారు. వ్యర్థాలను ఉత్పత్తి చేసే ప్రదేశంలోనే నాలుగు వర్గాలుగా వేరు చేయడం తప్పనిసరి చేశారు. వ్యర్థాల సరైన విభజన, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో 'కాలుష్య కారకుడే చెల్లించాలి' అనే సూత్రం ఆధారంగా పర్యావరణ నష్టపరిహారం విధించేలా నిబంధనలు రూపొందించారు. సరికాని ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను అనుసరించడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు కూడా పర్యావరణ నష్టపరిహారం వర్తిస్తుందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

---------------------------

దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం, రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా దక్షిణ ఛత్తీస్‌గఢ్,విదర్భ మీదుగా కదిలే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.దీని ప్రభావంతో ఈరోజు, రేపు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

మరో వైపు, అల్లూరి సీతరామారాజు, అంబేద్కర్ కోనసీమ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ నగరంలోని బెంజ్ సర్కిల్, ఏలూరు రోడ్డు, బందర్ రోడ్డుతో పాటు పలు లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలవడంతో అధికారులు యంత్రాలతో నీటిని తొలగిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో సముద్రంలోనికి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై ఆమె అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి జిల్లా తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సంక్షేమం, సుపరిపాలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. భావితరాలకు మంచి భవిష్యత్తు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. సమతుల ఆహారం, తల్లిపాల ప్రాధాన్యం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పోషకాహార లోపాల తగ్గుదలకు కృషి చేస్తున్నట్లు కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన కే. రమ్యశ్రీ పేర్కొంటూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

దుబాయ్‌లో జరుగుతున్న మహిళల ఆసియా కప్ క్రికెట్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. నిన్న శ్రీలంక, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. అంతకుమందు జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, బంగ్లాదేశ్ ను ఓడించి ఫైనల్ కు వెళ్లింది. దుబాయ్ వేదికగా రేపు జరిగే ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి.

=====================